క్లుప్తంగా

ఉచిత విద్యుత్ అందించాలని వినతి

ఆరిలోవ : నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో నాయీ బ్రాహ్మణ సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. జీవో ఇచ్చినప్పటికీ ఉచిత విద్యుత్ అమలు చేయకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. బీజేపీ జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ నరేష్, బ్రాహ్మణ సాధికారిక కమిటీ అధ్యక్షుడు రమేష్, ఆరిలోవ, గాజువాక తదితర ప్రాంతాల సెలూన్ షాపుల నిర్వాహకులు వినతిపత్రం అందించారు.

యూజీడీ లీక్‌తో దుర్వాసన



యూజీడీ నుంచి లీకవుతున్న మురుగునీరు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో 112వ నంబరు సచివాలయం భూగర్భ డ్రైనేజీ లీకవుతుండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని, మురుగు నీరు కాలనీలో ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరీలో విష్ణుభట్ల సిస్టర్స్, తదితరులు

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్, డాన్స్ అకాడమీ వార్షిక ఉత్సవాల్లో భాగంగా కళాభారతిలో మూడో రోజు సోమవారం విజయవాడకు చెందిన విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర సంగీత కచేరీ శ్రావ్యానందకరంగా సాగింది. వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా క్రిష్ణ ప్రసాద్, పిల్ల రమణమూర్తి, విష్ణుభట్ల సిస్టర్స్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విష్ణుభట్ల సిస్టర్స్ సంగీత కచేరీతో ప్రేక్షకులను మైమరిపించారు. ఈ కచేరీకి వయోలిన్‌పై డాక్టర్ మావుడూరి సత్యనారాయణ శర్మ, మృదంగంపై ప్రసాద్, ఘటంపై హరిబాబు సహకారం అందించారు.

18వ వార్డులో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులతో వైఎస్సార్ సీపీ నాయకులు

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18వ వార్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేశారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని పారిశుద్ధ్య కార్మికులు, వృద్ధులు, అంధ విద్యార్థులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. రక్తదానం చేస్తున్న యువకులను పరామర్శించడంతోపాటు అన్నదానం ప్రారంభించారు. అనంతరం ఉమ్మిడి కల్యాణ్‌ని పార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, 22వ వార్డు పార్టీ అధ్యక్షుడు పీతల గోవింద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భవనీశంకర్, నాయకులు శిరీష, పరదేశి, ధనలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

లలితా పీఠంలో త్రిరాత్రి గణపతి ఉత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఈ నెల 27 నుంచి 29 వరకు త్రిరాత్రి గణపతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. పీఠంలోని మణిద్వీపంలో కొలువైన విజయ గణపతికి 27న ఉదయం 6 గంటలకు విశేష పంచామృతాభిషేకం, పూజ, కార్యసిద్ధి, రుణ విమోచన కోసం సాయంత్రం మహా గణపతి హోమం, భైరవ గణపతి హోమం నిర్వహిస్తామని చెప్పారు.



ఆర్‌కే బీచ్ వద్ద పైపుల పరిస్థితి



ఇసుకలో కూరుకుపోయిన సిమెంట్ పైపులు



అలల తీవ్రతకు తీరంలో దెబ్బతిన్న పైపులు

ప్రజాధనం వృథా

- తీరంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- అశాస్త్రీయ విధానాలతో పర్యావరణానికి చేటు
- సముద్రంలోకి చేరుతున్న కలుషిత జలాలు



పాండురంగాపురం వద్ద సముద్రంలో కలుస్తున్న మురుగునీరు



పాండురంగాపురం వద్ద కోతకు గురైన ఇసుక మేటలు



విక్టరీ ఎట్ సీ వద్ద కోతకు గురైన ఇసుక మేటలు

ఏయూ క్యాంపస్ : శాస్త్రీయ అధ్యయనం లేకుండా చేపడుతున్న నిర్మాణాల వల్ల ప్రజాధనం వృథా అవుతోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారిపోతున్నాయి. మరోవైపు పర్యావరణానికి కూడా కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశాఖ సాగర తీరంలో చేస్తున్న ఇటువంటి నిర్మాణాలు ఇక్కడి తీరం కోతకు సైతం కారణంగా మారుతున్నాయి. నగరంలో కాలువలు, గెడ్డల నుంచి ప్రవహించే నీటిని నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. సాగర్‌నగర్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు తీరం పొడవునా మనకి ఇటువంటి దృశ్యాలు సర్వసాధారణంగా కనిపిస్తుంటాయి. తీరం పొడవునా కలుషిత జలాలు స్వేచ్ఛగా తీరంలో కలిసిపోతున్నాయి. కలుషిత జలాలు సముద్రంలో కలవడం వల్ల సముద్ర జీవులకు తీవ్ర నష్టం జరుగుతోంది.

ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రం...

మానవాళికి అవసరమైన ప్రాణవాయువు అధికంగా సముద్రం నుంచి వస్తుంది. దాదాపు 50 శాతానికిపైగా ఆక్సిజన్ మనకి సముద్రాల నుంచి లభిస్తుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సముద్రాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని మానవాళి మనుగడకు అవసరమైన ప్రాణవాయువును అందిస్తున్న సముద్రాలు కలుషితం కాకుండా చేయడం ఎంతో అవసరం. సముద్రంలో మురుగు నీరు నేరుగా కలవడంతో సముద్ర జీవులు సైతం మృత్యువాత పడుతున్నాయి.

లక్షలాది రూపాయలు వృథా

విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ఇటీవల నిర్వహించారు. ఆ సమయంలో హడావిడిగా విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న ప్రాంతంలో కల్వర్టు తరహా నిర్మాణం చేపట్టారు. పైనుంచి వచ్చే మురుగు నీటిని నేరుగా సముద్రంలో వదిలే ప్రాంతంలో మురుగునీటి ప్రవాహం బయటకు కనిపించకుండా సిమెంట్ పైపులతో నిర్మాణం చేపట్టారు. అప్పటి పరిస్థితుల కారణంగా శాస్త్రీయ అధ్యయనం, నిపుణుల సూచనలు లేకుండానే దీన్ని నిర్మించేశారు. పైపుల కింది భాగంలో పటిష్టమైన కాంక్రీట్ బేస్‌మెంట్ సైతం నిర్మించలేదు. కంటితుడుపుగా పనులు పూర్తిచేసి మమ అనిపించేశారు. తర్వాతి కాలంలో ఇవి సముద్ర కెరటాల తీవ్రతకు తట్టుకోలేక విరిగిపోయాయి. ప్రస్తుతం కొన్ని సిమెంట్ పైపులు ఇసుకలో కూరుకుపోయాయి. ఆర్‌కే బీచ్ వద్ద కూడా పైప్‌లైన్ల పరిస్థితి దాదాపుగా ఇలానే ఉంది. సముద్రతీరం సముద్రంలో అంతర్భాగం. దీనిని భూభాగంగా భావించి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టకూడదు. సముద్రం ఆటుపోట్లు వంటివి పరిగణనలోకి తీసుకుని నిర్మాణాలు చేపట్టాలి. అనాలోచిత నిర్ణయాలు తీసుకుని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజాధనం వృథా అవుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి వంటి నిర్మాణం చేపట్టారు. కెరటాల తీవ్రత ఈ ప్రాంతంలో అధికంగా ఉంటోంది. అటువంటి ప్రాంతంలో అనాలోచితంగా చేపట్టిన నిర్మాణాలు వృథాగా మారిపోయాయి.

కోతకు గురవుతున్న తీరం

తీర ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాల ఫలితంగా కోత పెరుగుతోంది. ముఖ్యంగా కల్వర్టులు నిర్మించి, పైపులు ఏర్పాటు చేసిన ప్రాంతంలో తీర ప్రాంతం భారీగా కోతకు గురైంది. పాండురంగాపురం డౌన్ వద్ద ఉన్న గెడ్డ నుంచి కూడా నిత్యం వేలాది లీటర్ల మురుగు నీరు సముద్రంలో కలుస్తోంది. ఈ ప్రవాహ ప్రాంతంలో భారీగా ఇసుక కోతకు గురవడంతోపాటు, మురుగు నీరు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. వీటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.



విక్టరీ ఎట్ సీ వద్ద నిర్మించిన కల్వర్టు, పైపులు

ఆరిలోవ పరిధిలో 218 వినాయక మండపాలు

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న వినాయక మండపాల వద్ద నిర్వాహకులు డీజేలు పెట్టవద్దని సీఐ హెచ్.మల్లేశ్వరరావు సూచించారు. వినాయక ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు పోలీస్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో అటు ధారపాలెం, పైనాపిల్‌కాలనీ, ఆరిలోవ నుంచి ఇటు ఎండాడ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్ వరకు ఇంత వరకు 218 మండపాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తుల్లోనే నిబంధనలు ఉన్నాయన్నారు. ఎన్ని రోజులు నిర్వహించాలి, ఎంత సమయం లోపు నిమజ్జనం చేయాలి తదితర వాటిని పొందుపరిచినట్లు తెలిపారు. మండపాలు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయకూడదన్నారు. వినాయక నిమజ్జనం చేసిన రోజు రాత్రి 10 గంటలలోగా నిర్దేశించిన సముద్రం ఒడ్డుకు విగ్రహాన్ని తరలించాలని సూచించారు. ఈ పరిధిలో సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం బీచ్‌లలో మాత్రమే నిమజ్జనానికి అనుమతిస్తామని తెలిపారు. నిమజ్జన సమయంలో డీజేలు, అసభ్యకరమైన డ్యాన్సులు నిర్వహించకూడదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.



మల్లేశ్వరరావు, ఆరిలోవ సీఐ

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో వాకింగ్‌కు వెళ్లిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని పారిపోయారు. ఆరిలోవ క్రైం ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఆదర్శనగర్‌కు చెందిన కృష్ణవేణి (49) కీళ్ల నొప్పులు కారణంగా వైద్యుల సూచనల మేరకు రోజూ వాకింగ్ చేస్తున్నారు. ఆమె రోజూ మాదిరిగా సోమవారం ఉదయం ఆదర్శనగర్ నుంచి విమ్స్ ప్రాంగణం వరకు వాకింగ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తున్న సమయంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. దీనిపై కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



లబ్ధిదారుకు స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎంవీపీ కాలనీ : జిల్లాలో క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీ అప్పుఘర్ చౌకధరల దుకాణం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ పాల్గొని కార్డుల పంపిణీని ప్రారంభించారు. రేషన్ డిపో నంబర్ 0387201 పరిధిలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్డుల్లో కుటుంబ పెద్ద ఫొటోతో పాటు కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించి ఉంటాయన్నారు. రేషన్ డిపోలో డీలర్ స్కాన్ చేసిన వెంటనే వివరాలన్నీ తెలుస్తాయన్నారు. సచివాలయాల సిబ్బంది ఆగస్టు 31 వరకు ఇంటింటికీ వెళ్లి కార్డులు పంపిణీ చేయాలని సూచించారు. ఆగస్టు 31 తర్వాత లబ్ధిదారులు సంబంధిత రేషన్ డిపోకు వెళ్లి కార్డులు పొందవచ్చన్నారు. జూన్ 30 వరకు అర్జీ పెట్టుకున్న లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

గణపతి మట్టి ప్రతిమల పంపిణీ

మద్దిలపాలెం : హెచ్‌బీ కాలనీలో భక్తులకు వినాయక మట్టి ప్రతిమలను పీవీఆర్ అండ్ ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ అధినేతలు పీవీఆర్ గుప్తా, మూర్తిరాజు సోమవారం పంపిణీ చేశారు. పూజా పుస్తకాలు అందజేశారు. సుమారు 10 వేల ప్రతిమలను సీతమ్మధార, ఎస్‌పీడీ, సబ్బవరం ప్రాంతాల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి పంపిణీ చేశామని తెలిపారు.

ఎంవీపీ కాలనీ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలో గణపతి మట్టి ప్రతిమలను సోమవారం పంపిణీ చేశారు. సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణతోపాటు అకాడమీ వ్యవస్థాపకుడు సతీష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి ప్రతిమలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతిమలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పీఎం పాలెం: లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. చంద్రంపాలెం హైస్కూల్ ఎదురుగా జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో కారుషెడ్ కూడలి వైపు నుంచి ఆనందపురం వైపు వెళుతున్న లారీ, స్థానిక హైస్కూల్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని ఢీ కొనడంతో ఆ వ్యక్తి సంఘటన స్థలంలోనే మరణించాడు. మృతుడికి సంబంధించి ఎటువంటి సమాచారం లభించలేదు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే వెంటనే పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌కు లేదా 94407 96060 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు రామాటాకీస్ రోడ్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాలలో జరగనున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం చాలా గొప్ప విషయమని, దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ 15 రోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ ఎ.వి.రమణ, డాక్టర్ మాధవి, ఆర్ఎంవో నవీన్‌కుమార్, పోస్ట్‌గ్రాడ్యుయేట్స్, పారామెడికల్ అఫ్తాల్మిక్ ఆఫీసర్లు ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్, ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యం నుంచే మంచి నడవడిక అవసరం

కొమ్మాది: ఆకతాయిలతో తిరుగుతూ బంగారం లాంటి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఆరిలోవ ఎస్‌ఐ రామదాసు విద్యార్థులకు సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో సోమవారం ఆయన ముచ్చటించారు. పాఠశాల ప్రాంతంలో ఆకతాయిల వికృత చేష్టలతో బాలికలు పడుతున్న ఇబ్బందులపై అందిన ఫిర్యాదు మేరకు ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. బాల్యం నుండే మంచి నడవడిక, మంచి లక్షణాలు అలవరుచుకోవాలని, చదువుపైనే ధ్యాస ఉంచి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. చెడు ఆలోచనలు, చెడు అలవాట్లు దరికి చేరకుండా చూసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఎవరైనా వెకిలి చేష్టలు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణంలో స్థానిక యువకుల నుంచి కానీ, విద్యార్థుల నుంచి కానీ ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేస్తే పూజ చేస్తారు.

పీజీఆర్ఎస్‌కు 25 దరఖాస్తులు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 25 అర్జీలు వచ్చాయి. జెడ్సీ కె.కనకమహాలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 11 వరకు అర్జీలు రావడం విశేషం. అత్యధికంగా అనధికార బడ్డీల తొలగింపు, ప్రభుత్వ భూముల పరరక్షణకు సంబంధించినవే కావడం గమనార్హం. జోన్‌లోని 12 వార్డుల పరిధిలోని పలు సమస్యలపై అర్జీలు అందాయి. టౌన్ ప్లానింగ్-11, ఇంజినీరింగ్ వర్క్స్-05, నీటి సరఫరా - 03, రెవెన్యూ - 02, ఎలక్ట్రికల్-02, యూసీడీ-02 చొప్పున ఉన్నాయి. ఈ అర్జీలపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.



జోన్ - 2 జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

పరవాడ : ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి ప్రభుత్వమే ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ సంతబయలులో ఆటో కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలపై ఈ నెల 28న తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు రాక, వ్యవసాయం గిట్టుబాటు కాక వేలాది మంది నిరుద్యోగులు ప్రైవేటు వ్యక్తులు, బ్యాంకుల వద్ద అప్పులు చేసి ఆటోలు కొనుక్కుని ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రతీ నెల అప్పులు తీర్చుకుంటూ, పిల్లలను చదివించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటోల ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ప్రభుత్వం బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఆటోవాలాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతీ డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.25 వేలు అందించాలని కోరారు. జీవో నంబరు 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహనాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

ఎర్రజెండా రెపరెపలు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డు ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. కార్మికుల నినాదాలతో హోరెత్తింది. సీఐటీయూ 11వ జిల్లా మహాసభలు పురస్కరించుకుని సోమవారం సాయంత్రం గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 93 మున్సిపాలిటీల్లో సీఐటీయూ ప్రధాన యూనియన్‌గా ఉందన్నారు. సీటూ నాయకుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ విలీన పంచాయతీ కార్మికులకు మినిమం టైమ్ స్కేల్ తీసుకు రావాలని హైకోర్టు ఆదేశాలిచ్చిందని తెలిపారు. గతంలో సాధించిన విజయాలు, పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు టి. నూకరాజు, జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఉరుకూటి రాజు, ఎస్. రమణ, జోన్ నాయకులు పాల్గొన్నారు.



గోపాలపట్నం ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు